క్లుప్తంగా

నేడు వర్సిటీల పునఃప్రారంభం

కర్నూలు కల్చరల్: దసరా పండుగ సెలవుల అనంతరం జిల్లాలోని యూనివర్సిటీలు సోమవారం పునఃప్రారంభం కానున్నాయి. రాయలసీమ యూనివర్సిటీ, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీల్లో సోమవారం నుంచి తరగతులు మొదలవుతాయని ఆయా వర్సిటీల రిజిస్ట్రార్లు డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ వి.లోకనాథ తెలిపారు.

ఆర్థరైటిస్‌పై అవగాహన పెరగాలి



మాట్లాడుతున్న డాక్టర్ సృజన

కర్నూలు(హాస్పిటల్): ఆర్థరైటిస్ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన పెరగాలని రుమటాలజిస్టు డాక్టర్ ఎ.సృజన చెప్పారు. ప్రపంచ ఆర్థరైటిస్ డేను పురస్కరించుకుని శనివారం స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో 18 కోట్లకు పైగా ప్రజలు ఆర్థరైటిస్ సమస్యతో బాధపడుతున్నారన్నారు. ఆర్థరైటిస్‌లో రెండు రకాలుంటాయని, వృద్ధాప్యంలో మోకాలు, తుంటి కీళ్లు అరగడం వల్ల ఆస్టియో ఆర్థరైటిస్, రోగనిరోధక శక్తి ఎదురు తిరగడం వల్ల కీళ్ల దగ్గరున్న కణాలన్నీ ఇన్‌ఫ్లమేషన్‌కు గురై వాచిపోతాయని దీనినే రుమటాయిడ్ ఆర్థరైటిస్ అంటారని వివరించారు. ఇందులో చేతుల వేళ్లు, మణికట్టు, కాళ్లు, కీళ్ల భాగాలతో పాటు శరీరంలోని ఇతర కణజాలాలు, కండరాలపై దీని ప్రభావం ఉంటుందని చెప్పారు. దీంతో పిత్తాశయం, ఊపిరితిత్తుల సమస్యలతో పాటు రక్తహీనత, లో బీపీ, మలబద్ధకం వంటి సమస్యలు వస్తాయన్నారు. ఇన్‌ఫెక్షన్ల కారణంగా సొరియాటిక్, సెప్టిక్, థంబ్ వంటి ఇతరత్రా ఆర్థరైటిస్ వ్యాధులూ వస్తుంటాయని చెప్పారు.

ఇస్కాన్‌లో భగవద్గీత తరగతులు

కర్నూలు కల్చరల్: కర్నూలు ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం శీల ప్రభుపాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణా తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు సందేశమిచ్చారు. ప్రతి ఒక్కరూ నిత్యం భగవద్గీత పఠనం, శ్రవణం చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఉత్తమ సమాజ నిర్మాణానికి భగవద్గీత ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. హరే రామ హరే కృష్ణ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. అనంతరం శీల ప్రభుపాదుల ప్రేమ విందు జరిగింది. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఎన్నిక

గడివేముల: స్థానిక అమ్మవారి శాలలో ఆదివారం గడివేముల ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గడివేముల నూతన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడుగా బి.మధుసూదన్ గుప్తాను ఎన్నుకున్నారు. అదేవిధంగా కమిటీ సభ్యులుగా ఈపూరి రాఘవేంద్ర, ఈపూరి మహేష్ బాబు, భీమిశెట్టి మల్లికార్జున, నరహరి మల్లికార్జున, కొండా సాయికుమార్, గ్రందే తరుణ్, రేవూరి షణ్ముఖ సాయి, రాచమడుగు రామ్ సాయి, రేవూరి మల్లికార్జున,డి హరినాథ్ బాబు, చాటకొండ సుమన్, పాలూరు లక్ష్మీనారాయణను ఎన్నుకున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మధుసూదన్ గుప్తా తెలిపారు.

ప్రొఫెసర్ సాయిబాబా మృతికి సంతాపం

కర్నూలు(సెంట్రల్): ఢిల్లీ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ సాయిబాబా అనారోగ్యంతో మృతి చెందడం అణగారిన వర్గాల ప్రజలు, ప్రజాస్వామిక వాదులకు తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయిబాబా మృతికి సీపీఐ జిల్లా సమితి తరపున ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. సాయిబాబాకు మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలతో బీజేపీ ప్రభుత్వం అక్రమంగా 9 సంవత్సరాలు జైల్లో పెట్టిందని, అప్పుడే ఆయన ఆరోగ్యం దెబ్బతిన్నదని, బయటకు వచ్చిన తర్వాత కోలుకోలేక మృతి చెందినట్లు భావిస్తున్నామన్నారు. నిరంకుశ మోదీ ప్రభుత్వానికి కూడా రోజులు దగ్గర పడ్డాయని, మోదీ చర్యలను దేశం గమనిస్తోందని పేర్కొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా

గోనెగండ్ల : మండలంలోని వేముగోడు గ్రామ సమీపంలో తెలంగాణకు చెందిన కారు శనివారం ఉదయం అదుపు తప్పి గుంతలో పడింది. తెలంగాణకు చెందిన చంద్రశేఖర్ తన కారులో సొంత పనుల నిమిత్తం ఆదోని పట్టణానికి వెళ్తుండగా.. వేముగోడు గ్రామ సమీపంలోకి రాగానే రోడ్డుపై ఉన్న గుంతలను తప్పించబోయి కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గోతిలో బోల్తా పడింది. ప్రమాదంలో కారులో ఉన్న చంద్రశేఖర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో గమనించిన స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. కోడుమూరు నుంచి ఎమ్మిగనూరు వరకు ప్రధాన రహదారి గుంతలు పడి అధ్వానంగా తయారైంది. దీంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రభుత్వం స్పందించి రోడ్డు వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



దుర్గాదేవి నిమజ్జనానికి కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



గ్రామోత్సవంలో హారతులు పడుతున్న చిన్నారులు



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం



శ్రీవల్లెలాంబదేవి ఉత్సవ విగ్రహ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ముగిసిన దసరా మహోత్సవాలు



లొద్దిపల్లెలో నిమజ్జనానికి తరలిపోతున్న దుర్గాదేవి

కోడుమూరు రూరల్ : దసరా మహోత్సవాలు ముగిశాయి. దసరా పర్వదినం శనివారం అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రం కోడుమూరులోని శ్రీవల్లెలాంబదేవి, శ్రీకాళికామాతా, శ్రీకన్యకాపరమేశ్వరీ, శ్రీరాములవారి దేవాలయం, శ్రీరాములమ్మ, శ్రీచౌడేశ్వరీదేవి, శ్రీగంగమ్మ, శ్రీతులజా భవానీ, శ్రీఅంబా భవాని ఆలయాల్లో అమ్మవార్ల ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దసరా మహోత్సవాల్లో శనివారం అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో మహిళలు నవధాన్యాల మొలకలను మోస్తూ నిర్వహించిన అమ్మవారి ఊరేగింపు ప్రజలను ఆకట్టుకుంది. అలాగే పట్టణంలోని చిన్నబోయవీధి, పెద్దబోయ వీధిలకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో వెళ్లి శ్రీవల్లెలాంబదేవికి నైవేద్యాలను సమర్పించారు. కోడుమూరులోని ఒకటవ వార్డులో కొలువుదీరిన దుర్గాదేవి విగ్రహానికి ప్రత్యేక పూజల అనంతరం ఆదివారం సాయంత్రం హంద్రీనదిలో నిమజ్జనం చేశారు. అమ్మవారి ఊరేగింపు ముందు మహిళలు, యువతుల కలశాలతో ఘనంగా సాగనంపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, శ్రీకాళికాదేవి, శ్రీవల్లెలాంబదేవి, ఎస్ఎస్‌కె సమాజ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సి.బెళగల్: దసరా పర్వదినం సందర్భంగా శనివారం అమ్మవార్లలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రం సి.బెళగల్‌లోని పడమటి ఆంజనేయస్వామి, ఈశ్వరాలయం, శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయం, శ్రీ రంగనాథుడి ఆలయం, శ్రీవాల్మీకి రామాలయంలోని దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో అమ్మవారికి చిన్నారులు సమూహికంగా హారులు సమర్పించారు. ఆలయాలలో గణపతి పూజ, పంచామృత అభిషేకాలు, అర్చలనలు నిర్వహించి దసరా వేడుకలకు ముగింపు పలికినట్లు పూజారులు సుదర్శణమాచార్యులు, నరసింహారావు తెలిపారు.

కర్నూలు రూరల్: దసరా పర్వదినం శనివారం అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తిశ్రద్ధలతో అమ్మవార్ల విగ్రహాలను నిమజ్జనం చేశారు. నిమజ్జనం సందర్భంగా కళాకారులు నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉల్చాల, జి.సింగావరం గ్రామలలో కొలువుంచిన విగ్రహాలను కేసీ కెనాల్‌లో నిమజ్జనం చేశారు. అదేవిధంగా గార్గేయపూరం, నూతనపల్లె, నందన పల్లే, సూదిరెడ్డి పల్లె గ్రామలలో కొలువుదీరిన అమ్మవారి విగ్రహాలను గార్గేయపూరం చెరువులో, పంచలింగాల, ఈ.తాండ్రాపాడు, గొందిపర్ల గ్రామాలకు సంబంధించిన విగ్రహాలను తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు.

పాణ్యం: దసరా ఉత్సవాలు ముగిశాయి. దేవాయదాయశాఖ ఆధ్వర్యంలో కొలువుంచిన అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతం ఉత్సవ మూర్తుకు గ్రామోత్సవం నిర్వహించారు. విచిత్ర వేషధారణలో కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ఆట్టుకున్నాయి. అలాగే హైందవశక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం అంగరంగవైభవంగా అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. కళాకారుల నృత్యాలు, డప్పువాయిద్యాల మధ్య అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి పాణ్యం చెరువులో నిమజ్జనం చేశారు.

ఓర్వకల్లు: శరన్నవాత్రుల సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలలో కొలువుదీరిన అమ్మవార్లలకు దసరా సందర్భంగా ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తిశ్రద్ధల మధ్య అమ్మవార్ల విగ్రహాల నిమజ్జనోత్సవం వైభవంగా సాగింది. హుసేనాపురంలో కొలువుదీరిన అమ్మవారి విగ్రహానికి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనోత్సవాన్ని ప్రారంభించారు. నిమజ్జనోత్సవంలో కళాకారులు నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలలో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

కల్లూరు: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గత తొమ్మిది రోజులుగా పూజలందుకున్న అమ్మవారికి దసరా పర్వదినం ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. డప్పు వాయిద్యాల మధ్య అమ్మవారి ఊరేగింపు వైభవంగా సాగింది. చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

● శమీ వృక్షానికి కాటసాని పూజలు



శమీ వృక్షాన్నికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: కల్లూరు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో శనివారం విజయదశమి వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు శమీ చెట్టుకు ప్రత్యేక శ్రద్ధలతో పూజలు చేశారు. కల్లూరు అర్బన్ పరిధిలోని కల్లూరు, వీకర్‌సెక్షన్ కాలనీ, గణేష్‌నగర్‌లో అమ్మవార్లకు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పూజలు చేశారు. అనంతరం దేవి శరన్నవరాత్రిలో భాగంగా జమ్మి చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ప్రజలందరూ సుఖ సంతోషలతో ఉండాలని కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గౌరు చరిత



అమ్మవారి ఊరేగింపులో చిన్నారులు, మహిళలు



కన్యకా పరమేశ్వరీ పల్లకోత్సవంలో పాల్గొన్న భక్తులు



అమ్మవారి ఊరేగింపులో విచిత్ర వేషధారణ కళాకారుల నృత్యాలు



అమ్మవారి నిమజ్జనోత్సవంలో చిన్నారుల నృత్యాలు



అమ్మవారి ఊరేగింపులో మొలకలతో పాల్గొన్న మహిళలు

నేడు మద్యం దుకాణాలకు లాటరీ

కోడుమూరు రూరల్: మద్యం దుకాణాల కోసం టెండర్లు వేసి ఎదురు చూస్తున్న ఆశావాహుల నిరీక్షణ సోమవారం ఫలించనుంది. ఉదయం కర్నూలు జిల్లా పరిషత్‌లో నిర్వహించనన్ను లాటరీలో దరఖాస్తుదారుల భవితవ్యం తేలబోతుంది. మద్యం దుకాణాల దరఖాస్తుకు ప్రభుత్వం నాన్ రిఫండబుల్ ఫండ్ రూ.2లక్షలు పెట్టినా ఆశావాహులు ఏమాత్రం తగ్గలేదు. ఒక్కొక్కరు నాలుగైదు దరఖాస్తులను వేయడం గమనార్హం. కోడుమూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 14మద్యం దుకాణాలకు సంబంధించి మొత్తం 510 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోనే కోడుమూరు కర్నూలు తర్వాత రెండవ స్థానంలో నిలిచింది. స్టేషన్ పరిధిలోని కోడుమూరు మండలంలో మొత్తం 5మద్యం దుకాణాలకు 150దరఖాస్తులు, గూడూరులోని 3మద్యం దుకాణాలకు 153దరఖాస్తులు, ఇందులో 34వ దుకాణానికి ఏకంగా 99దరఖాస్తులు రావడం గమనార్హం. అలాగే వెల్దుర్తిలోని 3దుకాణాలకు 109 దరఖాస్తులు, సి.బెళగల్‌లోని రెండు మద్యం దుకాణాలకు 84, క్రిష్ణగిరిలోని ఒక మద్యం దుకాణానికి 14దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ మంజుల ఆదివారం వివరాలు వెల్లడించారు.

నగరంలో 'పొట్టేల్' బృందం సందడి



కొండారెడ్డి బురుజు వద్ద పొట్టేల్ సినిమా యూనిట్

కర్నూలు కల్చరల్: నగరంలో పొట్టేల్ సినిమా బృందం సందడి చేసింది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం కొండారెడ్డి బురుజు వద్ద హీరో యువ చంద్రకృష్ణ పొట్టేలును పట్టుకొని అలరించారు. పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు పడే కష్టాన్ని ఈ సినిమాలో చూపించామని హీరో వెల్లడించారు. యువతకు కావాల్సిన అన్ని అంశాలను దర్శకుడు సాహిత్ చక్కగా చిత్రీకరించారన్నారు. చిత్రంలో అనన్య నాగేళ్ల హీరోయిన్‌గా ఆకట్టుకుంటుందన్నారు. నిషా ఎంటర్‌టైన్‌మెంట్స్, ప్రజ్ఞా సన్నిధి క్రియేషన్స్‌లో కె.నిషాంక్ రెడ్డి, ఎస్.సురేష్‌కుమార్ సినిమా రూపొందించారన్నారు. శేఖర్ చంద్ర సంగీతం అందించారని చెప్పారు. చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పల్లె పండుగ'

సి.బెళగల్: మండలంలోని గ్రామాల్లో సోమవారం నుంచి పల్లె పండుగ కార్యక్రమాలను నిర్వహిస్తామని ఎంపీడీఓ రాణెమ్మ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పల్లె పండుగ కార్యక్రమాల్లో భాగంగా 14 నుంచి 20వ తేదీ వరకు గతంలో గుర్తించిన అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. సోమవారం బ్రాహ్మణదొడ్డి, మధ్యాహ్నం మారందొడ్డి గ్రామాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

కల్లూరులో..

కల్లూరు: గ్రామ పంచాయతీలలో సోమవారం నుంచి 'పల్లె పండగ' వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీన ఉలిందకొండ, యాపర్లపాడు, 15న నాయకల్లు, చెట్లమల్లాపురం, కొంగనపాడు, 16నతడకనపల్లె, 17న పెద్దటేకూరు, చిన్నటేకూరు గ్రామాల్లో పల్లె పండగ నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా 18వ తేదీన బస్తిపాడు, పుసులూరు, బొల్లవరం, 19న ఎ.గోకులపాడు, సల్కాపురం, నెరవాడ, 20న పర్ల గ్రామ పంచాయతీలో ఈ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

నేడు మండల మీట్

పాణ్యం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల మీట్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎంపీపీ ఉసేన్‌బీ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వహించే సర్వసభ్య సమావేశానికి అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు హాజరు కావాలని సూచించారు. అదేవిధంగా పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి

ఓర్వకల్లు: మండల పరిధిలోని కేతవరం నుంచి గార్గేయపురం వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న కోరారు. ఆదివారం సీపీఎం నాయకులు రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వాహనాల రాకపోకలు సాగే ఈ రోడ్డును సుద్దమట్టితో కాకుండా నాణ్యమైన గ్రావెల్‌తో నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీధర్, వెంకటేశ్వర్లు, రంగస్వామి, బుగ్గరాముడు, నాగరాజు, మధుసూదన్‌బాబు, శేషాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' లేనట్లేనా?

- ఖరీఫ్ ముగిసినా ప్రభుత్వం నుంచి అందని పెట్టుబడి సాయం
- రబీ సాగుకు ఇబ్బంది పడుతున్న రైతులు
- జగనన్న పాలనలో ఠంచన్‌గా రైతుభరోసా సాయం
- నేడు ఆ ఊసే ఎత్తని టీడీపీ కూటమి సర్కార్



కోడుమూరులో ట్రాక్టర్‌తో శనగ విత్తనం వేస్తున్న రైతులు

కోడుమూరు రూరల్ : రైతన్నను సాగు కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. అండగా నిలువాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు అన్నివర్గాల నుంచి వెల్లువెత్తుతున్నాయి. ఖరీఫ్ ముగిసి రబీ సీజన్ ప్రారంభమైనా రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20వేలు అందిస్తామంటూ ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు హామీలు గుప్పించిన విషయం తెలిసిందే. అయితే గద్దెనెక్కని సీఎం చంద్రబాబు హామీలను అమలు చేయడంలో విఫలం అయ్యారని రైతులు విమర్శలు గుప్పిసుస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన రైతుభరోసా పథకాన్ని కూటమి సర్కార్ అన్నదాత సుఖీభవ పేరు మార్చిందే తప్పా అమలు చేయడం లేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సీజన్ ప్రారంభమైనా పెట్టుబడి సాయం ఊసే ఎత్తక పోవడంతో సాగుకు పెట్టుబడులు లేక రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సబ్సిడీ పేరుతో రైతులను మోసం

కోడుమూరు నియోజకవర్గంలో రబీ కింద అధిక శాతం మంది రైతులు పప్పు శనగను సాగు చేస్తారు. జనగన్న పాలనలో శనగలకు 40శాతం సబ్సిడీ ఇస్తే ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం మార్కెట్ రేటును అధికంగా చూపి కేవలం 25శాతం మాత్రమే శనగ విత్తనాలపై సబ్సిడీ ఇచ్చింది. దీంతో ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ రేటు, బయట మార్కెట్ రేటులో పెద్దగా తేడా లేదు. ప్రభుత్వం అందజేసే సబ్సిడీ విత్తనాల మూలంగా ఒరిగిందేమీ లేదంటూ బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు రైతులు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఠంచన్‌గా పెట్టుబడి సాయం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యనిచ్చింది. ప్రతియేటా సీజన్‌కు ముందుగానే రైతుభరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయంగా అందజేసింది. ప్రతి ఏడాది నియోజకవర్గంలోని 57,164మంది రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద ఒక రైతుకు రూ.13,500 ప్రకారం చెల్లించేది. ఖరీఫ్ పంట వేసే ముందు మే నెలలో రూ.7,500, ఖరీఫ్ పంట కోత, రబీ అవసరాల కోసం అక్టోబర్‌లో రూ.4వేలు, జనవరిలో పంటకోతల సమయంలోనూ రూ.2వేల చొప్పున ఠంచన్‌గా అందజేస్తూ రైతులకు అండగా నిలిచింది వైఎస్‌ జగనన్న ప్రభుత్వం. అయితే అన్నదాత సుఖీభవ కింద ఏటా రూ.20వేలు చొప్పున రైతులకు పెట్టుబడి అందిస్తామన్న సీఎం చంద్రబాబు ఆ విషయాన్నే మరిచారు. దీంతో రైతులకు సాగు పెట్టుబడికి ఇబ్బందులు తప్పడం లేదు.

ఖరీఫ్ దిగుబడులు అంతంత మాత్రమే...

టీడీపీ కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందజేయకపోయినా చిన్న,సన్నకారు రైతులు ఖరీఫ్ సాగుకు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఖర్చు చేశారు. వర్షాభావ పరిస్థితులు, అధిక వర్షాల వల్ల ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల దిగుబడులు అంతంత మాత్రంగానే వచ్చాయి. చాలామంది రైతులకు పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి నెలకొంది. రబీ సీజన్‌కు కూడా ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించకుంటే రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి పెట్టుబడి సాయం అందజేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పెట్టుబడులకు డబ్బుల్లేక ఇబ్బందులు



జగనన్న పాలనలో ప్రతి ఏడాది రైతు భరోసా డబ్బులు వచ్చేవి. పంటల సాగుకు ఎంతగానో ఉపయోగపడేవి. నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎలాంటి డబ్బులు వేయకపోవడంతో పంటల సాగుకయ్యే పెట్టుబడుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం అందజేస్తే బాగుంటుంది.

– రైతు చిన్న లక్ష్మన్న, గార్గేయపురం

పెట్టుబడి సాయం అందించాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి యేడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే పెట్టుబడి సాయాన్ని అందించేది. నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. ఖరీఫ్ సీజన్ ముగిసినా పెట్టుబడి సాయం మాత్రం అందలేదు. పంటల సాగుకు వడ్డీ వ్యాపారస్తులే దిక్కవుతున్నారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తామన్న రూ.20వేలు అందజేస్తే రబీ సాగుకు ఎంతగానో మేలవుతుంది.

– చిన్న హనుమంతు, బైన్‌దొడ్డి